సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 1 । ఆగస్టు । 2024



బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మానసిక ఒత్తిడితో చదవలేకపోతున్నానని.. తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. - 8లో



పొలంలో వ్యక్తి దారుణ హత్య

పొలంలో ఉసిరికాయల రామచంద్ర అనే వ్యక్తిని దారుణంగా నరికి చంపిన ఘటన బుధవారం కలకడ మండలం కదిరాయచెర్వు గ్రామంలో చోటు చేసుకుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.340
రెండోరకం	రూ.200	రూ.268



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 902 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	448	464
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 281.060 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఒంటిమిట్ట రామాలయం మరమ్మతులపై సమీక్ష



ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం గర్భగుడి పై ఉన్న విమాన గోపురానికి త్వరలో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా గురువారం భారత పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే గుడిలోని పలు అభివృద్ధి పనులకు, పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించే వెసులుబాటుపై కూడా నిర్ణయం తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

నేడు మంత్రి చేతుల మీదుగా పెన్షన్ల పంపిణీ

రాయచోటి: ఆగస్టు 1వ తేదీన పంపిణీ చేయనున్న పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. గురువారం ఉదయం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద వివిధ కేటగిరీలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా పెన్షన్ అందజేయనున్నట్లు తెలిపారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డులలో మంత్రి పర్యటిస్తారన్నారు.

మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీగా శ్రీనివాసులు



కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) ఇన్‌ఛార్జ్ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ వై శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈయన కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్డీ డాక్టర్ రత్నకుమారి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ స్థానంలో ప్రభుత్వం శ్రీనివాసులును నియమించింది.


రాజంపేట డీఎస్పీగా కె.ప్రకాశ్‌బాబు

రాజంపేట: రాజంపేట డీఎస్పీగా కె.ప్రకాశ్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఈయన విజయవాడ దిశ మహిళ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తూ, రాజంపేటకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసే చైతన్యను పోలీసు హెడ్‌క్వార్టర్‌కు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

తల్లిపాల ప్రాముఖ్యత పోస్టర్ ఆవిష్కరణ

రాయచోటి: పుట్టిన పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపే పోస్టర్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆవిష్కరించారు. బుధవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి జేసీ ఆవిష్కరించారు. బిడ్డ జన్మించిన మొదటి గంటలోనే తల్లి ముర్రు పాలు అమృతం లాంటివని అన్నారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని, వీటికి ప్రత్యామ్నాయం లేదని అందరూ గుర్తించాలన్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు



ఓపెన్ స్కూల్ విధివిధానాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలో 2024–25 సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ ప్రవేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆయన బుధవారం పది, ఇంటర్ విద్యార్థుల విధివిధానాలకు సంబంధించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్‌బాబు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ రవికుమార్, జీసీడీఓ రాధా, సీఎంఓ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షించని మేఘం!





చేతిలో వాడిపోయిన వేరుశనగ మొక్క చూపుతున్న రైతు పేరు తమ్మిశెట్టి రమణయ్య. ఈ రైతుది గాలివీడు మండలం నూలివీడు పంచాయతీలోని శ్రీనివాసపురం. ఈయనకు 4 ఎకరాల పొలం ఉండగా, అందులో వేరుశనగ పంట సాగు చేశాడు. ప్రస్తుతం వర్షం లేకపోవడంతో వేరుశనగ కాస్త వాడిపోతోంది. భారీ పదును వర్షం కురిస్తే తప్ప కుదురుకోవడం కష్టమే.



ఇతని పేరు ఆదిమూలం దుర్గయ్య, ఇతని ఊరు గొల్లపల్లె చౌటపల్లి గ్రామం, లక్కిరెడ్డిపల్లి మండలం. ఇతనికి ఉన్న పొలం మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేసుకున్నాడు. తుఫాను ప్రభావంతో ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తూ ఉన్నాయి. జూన్‌లో వేరుశనగ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంట సాగు చేశాడు. నెలన్నర రోజులుగా వర్షాలు లేక పంట ఎండిపోయే పరిస్థితిలో ఉంది. వర్షం వస్తే తప్ప పంటను దక్కించుకోవడం కష్టం.



గాలివీడు మండలం నూలివీడు వద్ద వర్షం జాడ లేక వాడిపోయిన వేరు శనగ పంట

- జిల్లాలో అలుముకుంటున్న కరువు ఛాయలు
- అన్నదాతను కరుణించని వరుణుడు
- వేరుశనగ, ఇతర పంటలపై తీవ్ర ప్రభావం
- ఎన్ని తుఫాన్లు వస్తున్నా.. కురవని మోస్తరు వర్షం
- జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 65,386 హెక్టార్లు
- 12,165 హెక్టార్లలో వివిధ రకాల పంటలు
- రెండు నెలలుగా మంచి వర్షాలు లేకపోవడంతో ఉన్న సాగుపై ప్రభావం
- ఇక ప్రత్యామ్నాయ పంటలు వేయాలన్నా పదునైతేనే అవకాశం

సాక్షి రాయచోటి: రాయలసీమకు ఒకనాడు రతనాలు అమ్మిన చరిత్ర ఉంది.. అంతే ఘనంగా రాజులు ఏలిన ప్రాంతం.. అలాంటి సీమలో వ్యవసాయానికి కొదవ లేదు. పంటలు పండించాలన్నా...రైతు మోములో చిరునవ్వు చిందించాలన్నా...వరుణుడు చల్లని చూపు చాలా అవసరం. కానీ అనేక తుఫాన్లు వస్తున్నా...నల్లని మేఘాలు కమ్ముకుంటున్నా వరుణ దేవుడు మాత్రం కరుణించడం లేదు. ఖరీఫ్ సాగులో భాగంగా విత్తనపు పనులు చేపట్టినా వర్షపు జాడ లేక కొంతమంది రైతులు అల్లాడిపోతుండగా... పదును వర్షం లేక విత్తనం వేయలేక మరికొంతమంది రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఎటు చూసినా మళ్లీ కరువు పంజా విసురుతోంది. ఎన్నో ఆశలతో ఖరీఫ్‌కు సిద్ధమైన అన్నదాతకు ప్రస్తుతం కనిపిస్తున్న కరువు ఛాయలు ఆందోళన కలిగిస్తున్నాయి.

జిల్లాలో ప్రధాన పంటల సాగుకు సంబంధించిన వివరాలు (హెక్టార్లలో)

- జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం: 65,386
- ఇప్పటివరకు పంటల సాగు: 12,165
- వేరుశనగ పంట సాగు: 6010
- మొక్కజొన్న : 593
- వరి: 316
- కందులు: 144



అంతంత మాత్రంగానే సాగు

జిల్లాలో ప్రధానంగా వర్షాధారం కింద పెద్ద ఎత్తున పంటలు సాగు చేయడం పరిపాటి. ప్రతి ఏడాది ఖరీఫ్‌లో సుమారు 65,386 హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తారు. కానీ కాలం కలిసి రాక అరకొర పదునులోనే ఎన్నో ఆశలతో విత్తనం వేసిన రైతుకు మళ్లీ కరువు భయం వెంటాడుతోంది. విత్తనం వేసి దాదాపు నెలన్నర రోజులు అవుతున్నా ఇప్పటికీ వర్షపుజాడ కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 12,165 హెక్టార్లలో వేరుశనగ పంటతోపాటు మొక్కజొన్న, వరి, సజ్జ, అలసంద, అనుములు, ఆముదంతోపాటు ఇతర పలు వాణిజ్య పంటలను రైతులు సాగు చేశారు. అయితే పదునైన వర్షం కురవకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఖరీఫ్‌లో వర్షపాతం మి.మీ.లలో...

నెల	సాధారణం	కురిసింది
మే	43	78.5
జూన్	75.1	160.6
జులై	90.5	47.5

తుఫాన్లు వస్తున్నా....భారీ వర్షం ఏదీ?

రాష్ట్ర వ్యాప్తంగా పలు తుఫాన్లు వచ్చినా అన్నమయ్య జిల్లాలో మాత్రం ప్రభావం కనిపించడం లేదు. కనీసం బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షం వస్తుందనుకుంటే లాభం లేకుండా పోయింది. అంతకు మునుపు అరేబియా సముద్రంలో వాయుగుండం ప్రభావంతోనైనా జిల్లాపై జాలి చూపుతుందనుకుంటే వర్షపు జాడ లేదు. రుతు పవనాల ప్రభావంతోనైనా భారీ వర్షం వస్తుందనుకుంటే అక్కడక్కడా కొద్దిపాటి పదును వర్షంతోనే వరుణుడు సరిపెట్టడంతో రైతులు పూర్తి స్థాయిలో పంటలు వేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.

ప్రత్యామ్నాయానికైనా వర్షించేనా..

ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పదునైన వర్షం లభించకపోవడంతో పొలాల్లో పంటలు వాడుముఖం పడుతున్నాయి. వేరుశనగతోపాటు కంది, ఇతర పంటలు కూడా చినుకు కోసం ఎదురు చూస్తున్నాయి. మరోపక్క జులై నెలతో వేరుశనగకు అదును కూడా దాటిపోవడంతో రానున్న కాలంలో భారీ వర్షం పడితే తప్ప ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే పరిస్థితి లేదు. ఆగస్టు, సెప్టెంబరులో ఏదైనా భారీ వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతలు అడుగులు వేసేందుకు ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే వర్షం లేక పంటలు వాడిపోయి ఎండుముఖం పడుతుండడంతో జిల్లా వ్యాప్తంగా కరువు ఛాయలు అలుముకున్నాయి.

పీఎంసీ ఎన్నికలకు సన్నాహాలు

- నేడు నోటిఫికేషన్, 8న ఎన్నికలు

మదనపల్లె సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి ఎన్నికలను పాఠశాలల నుంచి నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు ఏర్పాటు చేసిన పేరెంట్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ)ల ఎన్నికలకు ఆగస్టు 1వతేదీన నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతిలో పీఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. జిల్లాలో ప్రాథమిక 1,734, ప్రాథమికోన్నత 162, ఉన్నత 304 పాఠశాలలున్నాయి. ఎన్నికలు జరిపించేందుకు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.. ఆగస్టు 1న నోటిఫికేషన్ ఇచ్చి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్లలిస్టు(తల్లిదండ్రులు) జాబితా ప్రచురిస్తారు. 5వతేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, అదే రోజు మధ్యాహ్నం 3–4 గంటల మధ్యలో తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. రాజకీయ జోక్యం లేకుండా ఆగస్టు 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పీఎంసీ ఎన్నికలను నిర్వహిస్తారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం



పీఎంసీ ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 1 న నోటిఫికేషన్ వెలువడనుంది. నిబంధల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడతాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకారాన్ని అందించేలా అవగాహన కల్పిస్తాం. –శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ.మదనపల్లె

సీమ ముద్ద బిడ్డను.. మరిచారా బాబూ.!

- పథకాల పేర్ల మార్పులో రాయలసీమపై వివక్ష!
- కూటమి ప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్న మేధావులు
- మిగతా పథకాలకైనా 'సీమ'వాసులకు స్థానం కల్పించాలి



బుడ్డా వెంగళరెడ్డి విగ్రహం

కడప సెవెన్‌రోడ్స్: ప్రభుత్వాలు మారినప్పుడల్లా పథకాలకు పేర్లు మార్చడం సహజం. తమ పార్టీ నాయకులు లేదా నాలుగు ఓట్లు వస్తాయనుకుంటే జాతీయ నాయకుల పేర్లు ప్రభుత్వ పథకాలకు పెట్టడం పరిపాటి. ఇదే కోవలో తాజాగా రాష్ట్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం వివిధ పథకాల పేర్లు మార్చింది. అందులో జగనన్న గోరుముద్ద పథకానికి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం'అని పేరు మార్చింది. ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టి ఆదుకున్న డొక్కా సీతమ్మ పేరుపై ఎవరికీ అభ్యంతరం ఉండాల్సిన పని లేదు. ఊళ్లకు ఊళ్లు కరువు బారిన పడి ప్రజలు మృత్యు ముఖంలోకి జారుతున్న విషాద సమయంలో తన ఆస్తుల్ని ధాన్యంగా మార్చి వేలాది పేదల కడుపు నింపి ప్రాణాలు కాపాడిన పూర్వపు కడప జిల్లా ఉయ్యాలవాడ గ్రామ వాసి బుడ్డా వెంగళరెడ్డి పేరు ప్రభుత్వానికి ఎందుకు స్ఫురణకు రాలేదని ఇక్కడి మేధావి వర్గం ప్రశ్నిస్తోంది.

దాతృత్వానికి మరో పేరు వెంగళరెడ్డి

1866లో రాయలసీమను భయంకర కరువు ఒకటి కబళించింది. ప్రజలు దాన్ని ఎర్రగాలి కరువు అని పిలిచేవారు. తినడానికి తిండి లేక, తాగేందుకు గుక్కెడు నీరు సైతం కరువై ప్రజలు డొక్కలు ఎండి అస్థిపంజరాలుగా మారారు. కలరా, మశూచి, బోవెల్ వ్యాధులు విజృంభించి వేల సంఖ్యలో జనం పిట్టల్లా రాలిపోయారు. కడుపు చేతపట్టుకుని వలసలు వెళ్లడంతో గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యాయి. ఈ తరుణంలో బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం గురించి ఆ నోటా ఈ నోటా విన్న బళ్లారి, అనంతపురం, కడప జిల్లాల ప్రజలు ఉయ్యాలవాడ గ్రామానికి చేరుకోవడం ప్రారంభించారు. అలా వేల సంఖ్యలో వచ్చిన కరువు బాధితులతో గ్రామం కిటకిటలాడింది. వెంగళరెడ్డి తాము నిల్వ ఉంచిన 12 పాతర్ల ధాన్యం అంటే 1440 బస్తాలు ఖర్చు చేసి పూటకు ఎనిమిది వేల మందికి చొప్పున అన్నం, అంబలి వంటివి అందజేసి ప్రాణాలు నిలిపారు. చివరికి తన భూములు అమ్మి అన్నదాన యజ్ఞాన్ని కొనసాగించారు. అలా మూడు నెలలకు పైగానే ఈ కార్యక్రమం నడిచింది. కరువు వల్ల తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయలేకపోయారని తెలుసుకున్న వెంగళరెడ్డి తాళిబొట్లు, ముక్కెరలు దానం చేశారు. వర్షాలు కురుస్తున్నాయని తెలియడంతో ప్రజలు తమ గ్రామాలకు బయలుదేరే సమయంలో 15 రోజులపాటు తినడానికి అవసరమైన భత్యం ఆయన అందజేశారు. రైతులకు పశువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు కూడా సమకూర్చారు.

విక్టోరియా మహారాణి పతకం

ఇంగ్లాండ్‌లోని విక్టోరియా మహారాణి వెంగళరెడ్డి దాతృత్వం గురించి తెలిసి ఆశ్చర్యపోయింది. బుడ్డా వెంగళరెడ్డిని మద్రాసుకు ఆహ్వానించి బ్రిటీషు రాజముద్రతో కూడిన విక్టోరియా మహారాణి బంగారు పతకాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఆ పతకం నేటికీ ఉయ్యాలవాడ గ్రామంలోని బుడ్డా వెంగళరెడ్డి వారసుల ఇంట్లో ఉండడం విశేషం.




వెంగళరెడ్డికి విక్టోరియా మహారాణి బహూకరించిన బంగారు పతకం

ముఖ్యమంత్రి సీమ వాసి అయినా....


సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ వాసి అయినప్పటికీ ఈ ప్రాంతంలోని మహనీయుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టాలన్న ఆలోచన లేకపోవడం దురదృష్టకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతృత్వం, త్యాగంలో ఎవరికీ తీసిపోని ఎంతోమంది రాయలసీమలో జన్మించారు. అధికార పార్టీకి చెందిన నాయకులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి గట్టిగా తీసుకు వెళ్లాలంటున్నారు.

'సీమ'నేతల వైఖరే కారణం



డొక్కా సీతమ్మ పేరును వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కోస్తా నాయకులు ఎలాంటి వారైనా ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై ప్రాంతీయ అభిమానాన్ని ప్రదర్శిస్తారు. బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, సుద్దపల్లె లక్షుమ్మ, చిన్నదండ్లూరు శివమ్మ తదితర గొప్పవాళ్ల గురించి రాయలసీమ నేతలు ఎప్పుడూ, ఎక్కడా మాట్లాడరు. ఎందుకంటే వాళ్ల గొప్పతనాన్ని తెలుసుకుంటే ప్రజలు తమను అసహ్యించుకుంటారనే భయమే ఇందుకు కారణం. ఈ ప్రాంత నాయకుల వైఖరి వల్లే రాయలసీమ వివక్షకు గురవుతోంది. – సీహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, అధ్యక్షుడు, రాయలసీమ కార్మిక కర్షక సమితి

ఇది ముమ్మాటికీ వివక్షే



కరువులో పేదలను ఆదుకోవడమే కాకుండా అనేక దానధర్మాలతో బుడ్డా వెంగళరెడ్డి మహాదాతగా గుర్తింపు పొందారు. స్వాతంత్ర్య భావనే లేని రోజుల్లో సిపాయిల తిరుగుబాటు కంటే ముందే బ్రిటీషర్లపై గొప్ప పోరాటం చేసి భావి జాతీయోద్యమానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎంతో ప్రేరణ ఇచ్చారు. ఏదైనా చారిత్రక స్థలానికి ఆయన పేరు పెట్టాలి. తొలి రాజకీయ ఖైదీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరి సుబ్బారావు, పప్పూరి రామచార్యులు వంటిఎందరో మహనీయులకు రాయలసీమ జన్మనిచ్చింది. మొట్టమొదటి ఆధునిక కావ్యాన్ని రాసిన కట్టమంచి రామలింగారెడ్డి సీమ వాసి. ఆధునిక సాహిత్య విమర్శకు ఆయన ఆద్యుడు. రాష్ట్ర సాహిత్య అకాడమికి ఆయన పేరు పెట్టడం ఎంతో సముచితం. రాష్ట్ర ప్రభుత్వానికి అమరావతి, అక్కడి అభివృద్ధి తప్ప మరేది పట్టలేదు. కనీసం ప్రభుత్వ పథకాల్లో కూడా సీమ వాసుల పేర్లు పెట్టలేదంటే ఇది ముమ్మాటికీ వివక్షే. – ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో జిల్లాస్థాయి రహదారులపై భద్రతా కమిటీ సమావేశాన్ని జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రహదారులపై ప్రమాదాల వివరాలు, హిట్ అండ్ రన్ కేసులు, రహదారులపై భద్రత అవగాహన కార్యక్రమాలు, బ్లాక్ స్పాట్లపై (ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలు) తీసుకున్న చర్యలు తదితర అంశాలపై ఆర్టీఓ భరత్ చవాన్ జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలలో రహదారుల భద్రత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆర్టీఓను ఆదేశించారు. ఈ ప్రమాదాల నివారణకు పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై భూ ఆక్రమణలను పర్యవేక్షించాలని ఆర్డీఓలకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సత్యనారాయణ, రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు వైఖోమ్ నదియా దేవి, మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్లు, డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య పాల్గొన్నారు.

జేసీ చేతుల మీదుగా స్కాలర్‌షిప్పులు పంపిణీ



స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులతో జేసీ ఆదర్శ రాజేంద్రన్

కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ముగ్గురు విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చేతుల మీదుగా స్కాలర్ షిప్, సర్టిఫికెట్లను అందించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జేసీ, రాజంపేట, మదనపల్లి సబ్ కలెక్టర్లు అశ్విత(ప్రభుత్వ పాఠశాల రాయచోటి), చెల్ల భవ్య(ప్రభుత్వ పాఠశాల మదనపల్లి) కాసువారిపల్లి నందిని(ప్రభుత్వ పాఠశాల బి కొత్తపేట) అనే ముగ్గురు విద్యార్థులకు రూ. 15 వేలు చొప్పున స్కాలర్ షిప్‌లు అందజేశారు. క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈ మొత్తం అందించినట్లు సీఏజీఎల్ సంస్థ డివిజనల్ మేనేజర్ జగదీష్ తెలిపారు.

రాపిడ్ శాంపిల్ సర్వే

ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తెలిపారు. ఇందులో భాగంగా సంబంధిత జిల్లా అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సమావేశం నిర్వహించారు.

క్లుప్తంగా

జనావాసాల్లో విషసర్పం



రక్తపింజరి పామును పట్టుకున్న వ్యక్తి

వాల్మీకిపురం : పట్టణంలోని జనావాసాల నడుమ విషసర్పం హల్‌చల్‌చేసింది. స్థానిక హసన్‌ఖాన్ వీధిలో ఉదయం నివాసాల మధ్యకు రక్తపింజరి పాము రావడంతో జనం పరుగులు తీశారు. చివరకి వాల్మీకీ నగర్‌కు చెందిన పాములు పట్టే సింహమల్లై వచ్చి దానిని పట్టి దూరంగా అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

సిద్దవటం : సిద్దవటం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా.. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని సెబ్ సీఐ నాగరాజు తెలిపారు. ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని రూ.10 వేల జరిమానా విధించామన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లోని గాండ్లపాలెం, కమ్మపాలెం, ఎస్. రాజంపేట, దర్జీపల్లె పెన్నానది పరివాహక ప్రాంతాల్లో నిఘా పెంచామన్నారు.

పొలంబడితో.. అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి చంద్రనాయక్

లక్కిరెడ్డిపల్లి : అతి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంపై అవగాహన కల్పించేందుకు పొలంబడి నిర్వహిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి బి.చంద్రనాయక్ అన్నారు. గంగనపల్లిలో జరిగిన పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం ఆయన పర్యవేక్షించారు. పొలంబడి నిర్వహణకు అవసరమయ్యే వివిధ రకాల సామగ్రి రైతులకు అందించడం, సాంకేతిక మెలకువలు పొలంబడి ద్వారా నేర్పుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఏడీఏ జయరాణి, లక్కిరెడ్డిపల్లి ఏవో రమేష్ బాబూరావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

అట్లూరు : అట్లూరు మండలం సోమశిల ముంపు ప్రాంతంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద జిల్లా టాస్క్‌ఫోర్స్ (ప్రత్యేక దళం) పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని.. అతని వద్ద భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఖాజీపేటకు చెందిన ఓ వ్యక్తి మండలంలోని సోమశిల మునక ప్రాంతమైన రాఘవరెడ్డిపేట సమీపంలో ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉంటూ ఏజెన్సీ ఏరియా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న కడప టాస్క్‌ఫోర్స్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మదనపల్లె : మానసిక ఒత్తిడితో చదవలేకపోతున్నానని.. తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. కురబలకోట మండలం పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ రామిగానిపల్లెకు చెందిన మధుసూదనరెడ్డి చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య లలితమ్మతో కలిసి బెంగళూరులో నివాసముంటున్నారు. ఆమె కుమారుడు జి.నవీన్‌కుమార్‌రెడ్డి(19) తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల కళాశాలకు వెళ్లిన నవీన్‌కుమార్‌రెడ్డి చదువుల ఒత్తిడిని భరించలేక మానసికంగా కృంగిపోయాడు. మంగళవారం తిరుపతి నుంచి రైలులో బయలుదేరి సీటీఎంకు చేరుకున్నాడు. రాత్రి వరకు స్టేషన్‌లోనే ఉన్నాడు. తాను పడుతున్న ఇబ్బందులను తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలిపి, చనిపోతున్నట్లుగా స్నేహితులకు రాత్రి 8.40 నిమిషాలకు సమాచారం పంపాడు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలోని అంగళ్ల వద్ద ఓ చింత చెట్టుకు వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు మదనపల్లె పోలీసులకు విషయం తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం పెద్ద సంఖ్యలో నవీన్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు, స్నేహితులు జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థి తండ్రి మధుసూదనరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన నవీన్‌కుమార్‌రెడ్డి

అప్పుల బాధతో రైతు..

ఓబులవారిపల్లె : చెన్నరాజుపోడు గ్రామానికి చెందిన జోగినేని చంగల్ రాయుడు(49) అప్పులు బాధ తాళలేక బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చంగల్ రాయుడు ఉదయం తన పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగాడని, సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో కుమారుడు వెళ్లి చూడగా చెంగల్ రాయుడు మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. మృత దేహాన్ని రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు.

పొలంలో వ్యక్తి దారుణ హత్య

కలకడ : పొలంలో ఓ వ్యక్తిని దారుణంగా నరికి చంపిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. డీఎస్పీ రామచంద్రరావు వివరాల మేరకు... కలకడ మండలం, కదిరాయచెర్వు గ్రామానికి చెందిన ఉసిరికాయల రామచంద్ర(45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కిలోమీటరు దూరంలోని వడ్డిపల్లె సమీపంలో సాగు చేసిన టమాట పంటను చూసుకునేందుకు కుమారుడు వినోద్ కుమార్(7)తో కలిసి మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంలో వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు రామచంద్రను అతి కిరాతకంగా కొట్టి, నరికి చంపారు. భయపడిన రామచంద్ర కుమారుడు వినోద్‌కుమార్, పక్క పొలంలో ఉన్న రైతు చలపతి రామచంద్ర బంధువులు, పోలీసులకు విషయం తెలిపారు. డీఎస్పీ రామచంద్రరావు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు రామక్రిష్ణారెడ్డి(కలకడ), రహంతుల్లా(కెవిపల్లె) మృత దేహాన్ని పరిశీలించారు. రక్తపు మరకల ఆధారంగా నిందితులను గుర్తించడానికి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. మృతుడు రామచంద్రకు భార్య లలిత, కుమారుడు వినోద్‌కుమార్, కుమార్తె లక్ష్మి ఉన్నారు. లలిత ఫిర్యాదు చేయడంతో హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు డీఎస్పీ తెలిపారు.



రామచంద్ర(ఫైల్)



హత్య జరిగిన స్థలంలో విచారణ చేస్తున్న సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి

పాఠశాలలో బోరు మోటారు చోరీ

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి పట్టణం రాయుడు కాలనీలోని తెలుగు ప్రాథమిక పాఠశాలలో బోరు, మోటారును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఉపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి, బయారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధులలో భాగంగా బుధవారం ఉదయం పాఠశాలకు రాగా బోరు, మోటారు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

వసతి గృహం పరిశీలన



విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్ : ఇది హాస్టలేనా...మరీ ఇంత అధ్వానమా...మరోసారి నేను విజిట్‌కు వచ్చే నాటికి ఈ పరిస్థితి కనిపిస్తే ఉపేక్షించను అంటూ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ అనుపమను జిల్లా ఐదో అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి హెచ్చరించారు. రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిసరాలు పరిశీలించారు. గదులలో నెలకొన్న అపరిశుభ్రత, వంట సామాగ్రి పరిశీలించి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని తిన్న తరువాత ఇలాంటిదా పిల్లలకు పెట్టేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అసౌకర్యాలపై విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించి మంచి సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు మృతిపై విచారణ



బాపనపల్లెలో పిచ్చయ్య మృతిపై విచారిస్తున్న మాధవరం పీహెచ్‌సీ సిబ్బంది

సిద్దవటం : మండలంలోని శాఖరాజుపల్లె పంచాయతీ పరిధిలోని బాపనపల్లికి చెందిన కౌలు రైతు ఏటూరి పిచ్చయ్య మృతిపై మాధవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం విచారించారు. వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ఈ నెల 27న పిచ్చయ్య పొలంలో కలుపు తీస్తుండగా తేలు కాటుకు గురై చికిత్స కోసం ఒంటిమిట్ట పీహెచ్‌సీకి వెళ్లారన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా జూలై 30న పిచ్చయ్య మృతి చెందారన్నారు. దీనిపై విచారించి నివేదిక అధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నాగవల్లి, ఎంపీహెచ్ఎస్ జ్యోతికళ, ఎంపీహెచ్ఏ యానాదయ్య, ఆశా వర్కర్ సారమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఏలూరు వాసి మృతి

వాల్మీకిపురం : విద్యుత్ షాక్‌కు గురై ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వాల్మీకిపురంలో మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకొంది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా పెదవేగి మండలం చక్రయగూడెం గ్రామానికి చెందిన పదిలం శీను(41) వ్యాపార నిమిత్తం ఏలూరు నుంచి డ్రైవర్ రెడ్డెప్పతోపాటు ఐచర్ లారీలో తమిళనాడులోని దారాపూర్‌కు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి టెంకాయలు నింపుకొని హైదరాబాద్‌కు వస్తున్నారు. మార్గ మధ్యంలో డ్రైవర్ రెడ్డెప్ప వాల్మీకిపురంలోని తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బైపాస్ రోడ్డులో ఓ పక్కగా లారీ నిలిపాడు. బుధవారం ఉదయం ఆ లారీ స్థానిక నివాసాలకు అడ్డుగా ఉందని చెప్పారు. డ్రైవర్ రెడ్డప్ప లేకపోవడంతో పదిలం శీను నెమ్మదిగా ముందుకు తీసుకెళ్లి నిలిపాడు. అయితే లారీపై ఉన్న విద్యుత్తు తీగలను గమనించకపోవడంతో ఒక్క సారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడిక్కడే మృతిచెందాడు. సీఐ పులిశేఖర్, ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. విద్యుత్తు తీగలు వేలాడి ఉండడమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్ రెడ్డెప్పను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఏఈ జాకీర్‌హుస్సేన్ వెళ్లి విద్యుత్తు తీగలు పునరుద్ధరించారు.



మృతి చెందిన పదిలం శీను

అనుమానాస్పదంగా క్వారీ కార్మికుడు మృతి

మదనపల్లె : క్వారీ కార్మికుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మంగళ వారం రాత్రి మదనపల్లెలో జరిగింది. బీహార్‌కు చెందిన రామ్ భలి(36) ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చి పుంగనూరు మండలంలోని పాలెంపల్లె క్వారీలో పనిచేస్తున్నాడు. మంగళవారం తన బంధువుతో కలిసి మదనపల్లెకు వచ్చి ఇద్దరూ మద్యం తాగారు. అనంతరం రెడ్డెప్పనాయుడు కాలనీ సమీపంలో ఓ మోరీ వద్ద అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంట ఉన్న బంధువు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెళ్లి పరిశీలించగా, మృతి చెంది పడి ఉండటాన్ని గమనించారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యువరాజు తెలిపారు.

గొర్రెల మందపై ఊరకుక్కల దాడి

– 24 గొర్రెలు, పొట్టేళ్లు మృతి

గుర్రంకొండ : గొర్రెల మందపై ఊర కుక్కలు దాడి చేయడంతో 24 గొర్రెలు, పొట్టేళ్లు అక్కడికక్కడే మృతిచెందగా, 14 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. గుర్రంకొండ పంచాయతీ దౌలత్‌ఖాన్‌పల్లెకు చెందిన గుర్రం సరోజమ్మ స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదురుగా తాత్కాలిక ఇనుప కంచె ఏర్పాటు చేసి గొర్రెల మందను ఉంచారు. బుధవారం ఉదయం పక్కనే ఉన్న స్వగ్రామానికి సరోజమ్మ వెళ్లింది. ఈ సమయంలో ఊర కుక్కల గుంపు గొర్రెల మందపై దాడి చేశాయి. ఇష్టానుసారంగా గొర్రెలను కరచి గొంతులు కొరికి చంపేశాయి. ఈ దాడిలో 22 గొర్రెలు చనిపోగా.. 14 గొర్రెలకు గాయాలయ్యాయి. రూ. 4 లక్షల నష్టం వాటిల్లిందని గొర్రెల కాపరి సరోజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు.



మృతిచెందిన పొట్టేళ్ల వద్ద బాధితురాలు సరోజమ్మ

మట్టి తరలింపుపై లోకాయుక్తకు ఫిర్యాదు

మైదుకూరు : మైదుకూరు నియోజకవర్గంలో మట్టి, ఇసుక, కంకర అక్రమ తరలింపుపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ.ప్రతాప్ రెడ్డి తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయల్టీ కట్టకుండా మైదుకూరు, బ్రహ్మంగారిమఠం, ఖాజీపేట మండలాల్లో మట్టి, ఇసుక, సుద్ద మట్టి, కంకర తరలిస్తున్న వైనంపై ఫిర్యాదు చేశానని తెలిపారు. సెప్టెంబర్ 10న వాయిదా ఉంటుందని పేర్కొన్నారు. మైదుకూరు, తదితర ప్రాంతాల్లోని చెరువు మట్టి తవ్వినా, రాయల్టీని స్థానిక సంస్థలకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాయల్టీ ఆయా సంస్థలకు జమ అయ్యేంత వరకూ వదిలే ప్రసక్తే లేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ దుర్మరణం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఫొటోగ్రాఫర్ మృతిచెందాడు. పట్టణంలోని పూలబావి వీధికి చెందిన చాపల్లివెంకటయ్య(45) ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య కళ్యాణితోపాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా.. నెల్లూరు రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి వద్ద వేగంగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ఓ వ్యక్తి వెంకటయ్యను ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన వెంకటయ్యను ప్రభుత్వాసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. బుధవారం ఉదయం మృతుడి కుమార్తె నవ్యశ్రీ ఫిర్యాదు మేరకు అర్బన్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘర్షణ కేసులో 29 మందికి రిమాండ్

కొండాపురం : టి.కోడూరులో కూటమి నాయకుల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. సోమవారం సోలార్ కంపెనీలోని కాంట్రాక్టు పనుల విషయమై ఘర్షణ తలెత్తిన విషయం విదితమే. వారిలో ఎంపీటీసీ ఎల్.రామమునిరెడ్డితోపాటు తొమ్మిది మంది, చింతాకు పవన్‌కుమార్‌రెడ్డితోపాటు 18 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో 29 మందికి జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బార్గవి రిమాండ్ విధించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంకం శివారెడ్డి

సుండుపల్లె : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాయవరం, మడితాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ పింఛను ప్రయోజనం, పీఎఫ్ ఫైనల్ పేమెంట్స్, ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్స్, తాత్కాలిక లోన్లు, సరెండర్ లీవ్ భత్యం అందించచాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా నిలిచి ఇబ్బందికర యాప్స్ తొలగించాలని, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకే తల్లికి వందనం సాయం అందించాలని కోరారు. అర్ధంతరంగా ఆగిన 'నాడు–నేడు' కార్యక్రమం గుత్తేదారులకు అప్పగించి పూర్తిచేసేలా చూడాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని 117 ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కార్యదర్శులు ఇస్మాయిల్, రాష్ట్ర మైనార్టీ కో–కన్వీనర్ ఆరీపుల్లా, జిల్లా మైనార్టీ కన్వీనర్ మున్వర్ బాషా, అంజాద్ బాషా, గణపతి, రెహమాన్; వెంకటరమణ నాయక్, నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏపీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

మదనపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్వీఆర్ కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న రైతు సంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనం మహాసభలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చించినట్లు తెలిపారు. నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చాక మూడు నల్ల వ్యవసాయ చట్టాలతోపాటు, విద్యుత్తు బిల్లులు తెచ్చి రైతులకు నష్టం చేశారన్నారు. దేశవ్యాప్తంగా రైతులు నిరసిస్తే..ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పి, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పినప్పటికీ నేటికీ అమలు చేయలేదన్నారు. ఆగస్ట్ 5న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ఆందోళనలు నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పీలేరు నియోజకవర్గంలో నష్టపోయిన బొప్పాయి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నారు అమ్మిన నర్సరీలు, ఫర్టిలైజర్స్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్, ఆఫీస్ బేరర్స్ జగన్నాథం, రామచంద్రయ్య, కాటమయ్య, రామానాయుడు, జమలయ్య, చిన్నం పెంచలయ్య, పీఎల్.నరసింహులు, మహేష్, వంగిమళ్లరంగారెడ్డి, కృష్ణప్ప, సాంబశివ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

తుపాకీతో కాల్పులకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : వ్యక్తిగత కక్షలతో బావమరిదిపై తుపాకీతో కాల్పులకు పాల్పడిన బావను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి తెలిపారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీఐ ఎన్.శేఖర్‌తో కలిసి ఆయన కేసు వివరాలు వెల్లడించారు. జూలై 28న రాత్రి మదనపల్లె మండలం వలసపల్లె సమీపంలోని నవోదయకాలనీలో రెడ్డి ప్రవీణ్ (25)పై అతడి బంధువు పూల దివాకర్ నాటుతుపాకీతో కాల్పులు జరిపారు. రెడ్డి ప్రవీణ్ స్వగ్రామం తంబళ్లపల్లె కాగా, ఏడాదిన్నరగా తల్లిదండ్రులతో కలిసి పూల దివాకర్ అన్న పురుషోత్తం ఇంట్లో ఉంటున్నాడు. ఆస్తిలో తనకు వాటా ఇవ్వలేదని అన్న పురుషోత్తం, వదిన రెడ్డెమ్మలపై పూల దివాకర్ కోపం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో 28న రాత్రి 10.30 గంటల సమయంలో దివాకర్, అన్నావదినలతో గొడవపడుతుండగా, రెడ్డి ప్రవీణ్, ఆనంద్ సర్దిచెప్పేందుకు వెళ్లారు. ఆగ్రహించిన దివాకర్ నాటు తుపాకీతో రెడ్డి ప్రవీణ్‌పై కాల్పులు జరిపాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆనంద్‌పై కొడవలితో దాడికి పాల్పడ్డాడు. గాయాలపాలైన రెడ్డిప్రవీణ్, ఆనంద్‌లను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రెడ్డి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి కృష్ణాపురం వద్ద ఎస్ఐ రవికుమార్ దివాకర్‌ను అరెస్ట్‌చేశారు. నాటుతుపాకీ, మచ్చుకత్తిని స్వాధీనం చేసుకుని, నిందితుడు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



హత్యకేసులో జీవితఖైదు శిక్షపడిన ముద్దాయి వంకర సుబ్రహ్మణ్యం

మదనపల్లె : ఓ హత్య కేసులో నిందితుడు వంకర సుబ్రహ్మణ్యంకు జీవిత ఖైదు విధిస్తూ మదనపల్లె సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బందెల అబ్రహాం తీర్పునిచ్చినట్లు సీఐ యువరాజు తెలిపారు. 2016 ఆగస్టు, 8న రాత్రి పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపంలోని భాగ్యలక్ష్మీ రైస్ మిల్లులో నిందితుడు వంకర సుబ్రహ్మణ్యం, భార్య సురేఖతో గొడవపడుతుండగా, అక్కడే జేబీటీ టైర్స్‌లో పని చేస్తున్న ఉద్యోగులు మణికంఠ, రాజేష్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. ఆగ్రహించిన వంకర సుబ్రహ్మణ్యం, భార్యాభర్తల మధ్య గొడవలో తలదూర్చేందుకు మీరెవరంటూ......ఇద్దరిపై కత్తితో దాడిచేశాడు. దాడిలో మణికంఠ అక్కడికక్కడే మృతిచెందగా, రాజేష్‌కు తీవ్రగాయాలవడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితుడు వంకర సుబ్రహ్మణ్యంను రిమాండ్‌కు పంపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి బందెల అబ్రహాం మణికంఠను హత్య చేసినందుకు ముద్దాయి వంకరసుబ్రహ్మణ్యంకు జీవిత ఖైదు, రాజేష్‌ను గాయాలపాలు చేసినందుకు ఏడేళ్ల జైలుశిక్షతోపాటు రూ.4 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో షార్ ఉద్యోగి మృతి

చిట్వేలి : చిట్వేలి మండలం వెంకట్రాజుపల్లికి చెందిన షార్ ఉద్యోగి మలిశెట్టి నరేంద్ర(39) బుధవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వెంకట్రాజుపల్లికి చెందిన మలిశెట్టి మాధవయ్య, శంకరమ్మ దంపతుల రెండో కుమారుడైన నరేంద్ర షార్‌లో కంప్యూటర్ విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. సహ ఉద్యోగి పదవీ విరమణ చేస్తున్నందున గిఫ్ట్ కోసం సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా పిండిపాలెం క్రాస్ వద్ద మంగళవారం మధ్యాహ్నం లారీని ఢీకొన్నారు. ఈ సంఘటనలో నరేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. అతడి వద్ద ఆధార్ కార్డు ఆధారంగా గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య అశ్విని, కుమారుడు మౌర్య ఉన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే..

షార్ ఉద్యోగి నరేంద్ర పార్థివ దేహాన్ని బుధవారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతి తెలియజేశారు.



మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, తదితరులు

పింఛనుదారులపై పుట్టా ఫిర్యాదు

- అన్నీ పునఃపరిశీలించాలని మండల అధికారులకు ఆదేశాలు
- మండల కార్యాలయం, ఆధార్ కేంద్రాల చుట్టూ వృద్ధుల అవస్థలు



ఇక్కడ కనిపిస్తున్న వృద్ధురాలి పేరు శ్రీపతి సరోజమ్మ. ఆమె వయస్సు 78 ఏళ్లు. 30ఏళ్ల క్రింద భర్త చనిపోవడంతో అప్పటి నుంచి పింఛను వస్తోంది. గత ఐదేళ్లు ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ అందింది. ఇపుడు పింఛనుదారులు వెరిఫికేషన్ చేసుకోవాలని చెప్పడంతో గత మూడు రోజులుగా మీ సేవ, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతోంది. ఏ పేపర్లు తీసుకురావాలో తనకు తెలియదని, సచివాలయం వద్దకు పోతే.. మీ సేవ వద్దకు వెళ్లాలని చెబుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

చాపాడు : మైదుకూరు నియోజకవర్గంలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బ్రంహ్మగారిమఠం మండలాల్లో 35,888 మంది పింఛన్లు పొందుతున్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పింఛనుదారుల్లో అనర్హులను గుర్తించి తొలగించాలని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు.. డీఆర్‌డీఏ పీడీ అన్ని ప్రాంతాలో పింఛన్ల వెరిఫికేషన్ చేయాలని ఉత్తర్వులు ఎంపీడీవోలకు అందాయి. గత నాలుగైదు రోజులుగా సచివాలయ పరిధిలోని పింఛను దారులను సచివాలయ సిబ్బంది విచారిస్తున్నారు. ఆగష్టు నెల 1న పింఛన్ అందుకునే లబ్ధిదారులంతా ఆందోళన చెందుతున్నారు.

పరిశీలన కోసం వృద్ధుల ఇక్కట్లు

పింఛన్ తీసుకునే లబ్ధిదారులంతా తమ ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల్లో అందివ్వాలని అధికారులు ఆదేశించారు. ఈ క్రమంలో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చర్మకారులు, చేనేతలు ఇలా అందరూ మళ్లీ అవసరమైన ధ్రువపత్రాలు సచివాలయాల్లో అందజేయాలని సూచించారు. దీంతో నియోజకవర్గ పరిధిలోని పింఛనుదారులంతా ఆగమేఘాలపై ధ్రువపత్రాలు పొందేందుకు ఆధార్, మీ సేవా, సచివాలయాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. వికలాంగులకు సదరం సర్టిఫికేట్, వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణ పత్రం ఉంటాయని, వృద్ధులు ఏ పత్రాలు ఇవ్వాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఒంటరి మహిళలు, చేనేత, డప్పు కళాకారులు, చర్మకారులు పత్రాల కోసం అవస్థపడుతున్నారు.